# అగ్ని


## రావినూతల సువర్ణా కన్నన్

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వాన. మామూలుగా కాదు— ఈదురుగాలి, భయంకరమైన ఉరుములతో!

ఎటుచూసినా నీళ్లు!

వీధులన్నీ జలమయమైపోయి దారీ తెన్నూ తెలియడంలేదు. పెద్ద పెద్ద చెట్లు సైతం పెళ పెళ విరిగి పడుతున్నాయి.

రాత్రి కావస్తోంది.



అలాంటి వాతావరణంలో, ఓ రెండు గదుల పెంకుటింటిలో తలుపులు బిగించుకుని ఒంటరిగా కూర్చుంది పార్వతి. బుజ్జి కిటికీ లోంచి బైటికి చూస్తున్నాడు.

పార్వతి ఓ నిరుపేద ఇల్లాలు!

తాగుబోతు, తిరుగుబోతు అయిన సుబ్బారావు భార్య!

ఎనిమిదేళ్ళ బుజ్జికి తల్లి!

కలవారంటి అక్కర్లకి సహాయంచేసే యంత్రం.

సుబ్బారావుని పెళ్ళి చేసుకున్న తర్వాత ఏ వారం రోజులు సుఖపడిందో ఆమె! తర్వాత అన్నీ అగచాట్లే.

పేరుకు భర్తవున్నా గుప్పెడు మెతుకులు తెచ్చి పెట్టే ఆశ లేదు. అలా అని ఆమె బైటికి వెళ్ళి పని పాటలు చేసుకుంటే అతనికి నామోషీ!

అతని మాటకి ఎదురు చెప్పలేని సగటు ఆడది పార్వతి. అందుకే ఎవరికైనా కావాలంటే అప్పడాలు, వడియాలు లాంటివి పెట్టివ్వడం, ఊరగాయల రోజుల్లో ఊరగాయలు పెట్టడం చేస్తూంటుంది. ఆ కష్టంతో వచ్చిన నాలుగురాళ్ళతో ఎలాగో నెట్టుకొస్తోంది. సుబ్బారావు ప్రెసిడెంటుగారి దగ్గర క్లర్కు.




ఇటీవల లయన్ లేడీస్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెట్రో ఆధ్వర్యంలో స్థానిక మహిళా సంస్థలు నిర్వహించిన శాంతి సమరయాత్రలో పాల్గొన్న శ్రీమతి మాలతీకిషోర్ (అధ్యక్షురాలు) ప్రభృతులు

పేరుకు క్లర్కే అయినా అతను యజమానికి చాలా రకాలుగా వుపయోగపడతాడు. ఫలితంగా కావల్సినంత

తాగుడు. అతనికి తాగుడుంటే భార్యా బిడ్డలు అసలు అక్కర్లేదు.

మూడు రోజుల క్రితం కారుమబ్బులు కమ్మి ప్రళయం రాబోతున్నట్టనిపించే సమయంలో ప్రెసిడెంట్ గారింటినించి కబురొచ్చింది సుబ్బారావుని రమ్మని.

గబగబా తిన్నా సుష్టుగా భోజనంచేసి వెళ్ళినవాడు ఇంతదాకా పత్తాలేదు.

పార్వతి ముందు భయపడింది. తర్వాత —

'పరవాలేదు. బతకనేర్చినవాడు! 'ఏమైపోడు' అనుకుంది.

అయితే అది పెళ్ళిళ్ళ సీజన్ కాకపోవడాన ఎవరూ ఆమెను సహాయానికి పిలవలేదు. ఇంట్లో బియ్యం నిండుకుని వారం రోజులయింది. భర్తని పోరితే ప్రెసిడెంటుగారింటి నుంచి ఓ రెండు సేర్లు తెచ్చి, పది బస్తాలు తెచ్చి పడేసినట్టు పోజు పెట్టాడు. అవెప్పుడో అయిపోయాయి. ఇరుగు పొరుగుల నడిగి అప్పులు తెచ్చింది. అవీ అయిపోయాయి.

వాన తగ్గాక తనే వెళ్ళి ప్రెసిడెంట్ గారి భార్య కాళ్ళు పట్టుకుని ఓ పావు బస్తా బియ్యం తెచ్చుకోవాలి అనుకుంది. అయితే మూడు రోజులు గడిచింది గానీ వాన మాత్రం తగ్గలేదు.

ఇంట్లో పిడికెడు బియ్యంగానీ, గుప్పెడు పిండీ, రవ్వలాంటివి గానీ లేవు. ఉన్నవి కాసినీ నిన్నా మొన్నా ఎలాగో సర్దింది. ఇంకా ఈ వాన వెలవకపోతే ఎలా?

ఆమెకి గుండెల్లో రాయి పడింది. గుప్పెడు నూక వుంటే గంజి కాచింది. ఆ గంజే భద్రంగా దాచింది. కొడుకు అన్నం అని ఎక్కడ అడుగుతాడో అన్న భయం ఆమెని ఆదోలా వణికించేస్తోంది.

"అమ్మా!"

ఆలోచనలో మునిగిపోయిన పార్వతి బుజ్జి పిలుపుతో ఉలిక్కిపడి వాస్తవంలో కొచ్చింది.




భవన నిర్మాతల
సంజీవిని
హనుమాన్ బ్రాండ్ సిమెంట్

సాంకేతిక నిపుణుల పరిజ్ఞానముతో అడుగడుగునా పరీక్షించి, ఆధునిక కట్టడములకు మేటిగా తయారు చేయబడిన సాటిలేని సిమెంట్ హనుమాన్ బ్రాండ్ సిమెంట్. కట్టడములు కలకాలము దిట్టముగా, పటిష్ఠంగా నిలవాలంటే ఉపయోగించండి హనుమాన్ బ్రాండ్ సిమెంట్.

సాంకేతిక నిపుణులచే మీ కట్టడములకు అనుకూలముగా తయారు చేయబడిన సిమెంట్ హనుమాన్ బ్రాండ్ సిమెంట్.




సోమేశ్వర సిమెంట్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీసు : నెం. 6-3-609/15,
ఆనంద్‌నగర్ కాలనీ,
ఖైరతాబాద్,
హైదరాబాద్ - 500 004. (ఆం.ప్ర.)
ఫోన్ : 36347.

MAYURA

"అమ్మా" మళ్ళీ పిల్చాడు బుజ్జి.

"ఏం నాన్నా!" మెల్లిగా లేచి కొడుకు దగ్గరి కెళ్ళింది పార్వతి.

"ఆకలేస్తోందమ్మా!"

వాడు మెల్లగానే అన్నా, ఆ మాట పిడుగుపాటే అయిందామెకి. రాత్రి నుంచీ వాడు ఆకలని గొడవ చేస్తూంటే 'నాన్న వస్తారనీ, వచ్చేటప్పుడు కూరలూ అవీ తెస్తారనీ' ఏవేవో చెప్పింది. అవన్నీ నమ్మిన ఆ పసివాడు తండ్రి ఆగమనానికి ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు.

గాలికి దీపం రెపరెపలాడింది.

కిటికీ తలుపులు వేసింది పార్వతి.

"అమ్మా"

"ఏం బుజ్జీ?"

"నాన్న ఇంకా రాలేదేం?" దీనంగా అన్నాడు.

"ఒచ్చేస్తారు నాన్నా! కాస్త వాన తగ్గగానే వచ్చేస్తారు" నమ్మకంగా అంది పార్వతి.

"వాన తగ్గడంలేదుగా?"

"ఇంకాస్సేపటికి తగ్గిపోతుంది."

"తగ్గగానే వచ్చేస్తారుగా?"

"ఆ!"

"బియ్యం అవీ తెస్తారుగా?"

"తప్పకుండా తెస్తారు. తేగానే వంటచేసి పెడతాను. అంతదాకా నువ్వు గొడవ చెయ్యకూడదు — సరేనా!"

'సరే' అన్నట్టు తలూపాడు బుజ్జి.

వాడి కళ్ళలోని వెలుగు చూసి భారంగా నిట్టూర్చింది పార్వతి.

మరో గంట గడిచింది.

మంచంమీద పడుకుని పొర్లుతున్నాడు బుజ్జి.

పార్వతి ఓసారి తలుపు తీసి బైటికి చూసింది.

భూమికీ, ఆకాశానికీ ఏకధారగా కురుస్తోంది వర్షం. అంతా కటిక చీకటి.

మళ్ళీ తలుపులు వేసేసి లోపలికొచ్చింది.

"అమ్మా!"

"ఏమిట్రా?"

"కడుపులో ఏదోలా వుందమ్మా!" — అది ఆకలి బాధ అని తెలియని బుజ్జి దీనంగా అన్నాడు.

'అది ఆకలిరా నాన్నా' మూగగా రోదించిందామె మాతృ హృదయం.

"పొద్దున గంజే కాస్త ఇవ్వవమ్మా — తాగాలని వుంది" మళ్ళీ వాడే అన్నాడు.


పార్వతి కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. తన్నుకొస్తున్న దుఃఖాన్ని పెదవుల్లోనే నొక్కిపెట్టి, లేచి వెళ్ళి గిన్నెలోని గంజిని గ్లాసులోకి వంచబోయింది.

అయితే దాన్నిండా చీమలు.

ఉసూరుమందామె ప్రాణం.

తేరుకుని మెల్లగా చీమలన్నీ ఏరి, కాస్త గంజి గ్లాసులో పోసి కొడుకు దగ్గరికొచ్చింది.

ఆ గ్లాసుని ఆత్రంగా అందుకున్నాడు బుజ్జి. ఒణుకుతున్న చేతులతో పట్టుకుని ఆప్యాయంగా తాగసాగాడు.



అలపర్తి ఉషారాణి-నందివెలుగు

రాత్రి అసహ్యించుకున్న గంజిని, వద్దని విసిరికొట్టిన గంజిని, ఇప్పుడు కోరి అమృతంగా తాగుతుంటే ఆ తల్లి ప్రాణం నీరయిపోయింది.

"అమ్మా! నువ్వూ కాస్త తాగమ్మా! ఉప్పువేస్తే గంజి బావుంది" గ్లాసు నోటినించి పక్కకి తీసి, తల్లికేసి చూస్తూ అన్నాడు బుజ్జి.

"ఊఁ ఊఁ తాగుతాను" కంగారుగా అందామె.

అయితే ఆ గంజి కూడా మరి కాస్తే వుందనీ, అది కాస్త తను తాగేస్తే, ఆ పసివాడికేం మిగులుతుందని ఆమె మనస్సులో వున్న భావం వాడికి చెప్పలేదు.

* * *

మరో రెండు రోజులు గడిచిపోయాయి.

వాన జోరు హెచ్చుతోందేగానీ తగ్గడంలేదు. ఏ క్షణాన్నైనా నీళ్ళు ఇంట్లోకొచ్చేస్తాయేమో అని భయంగా వుంది.

"అమ్మా ఆకలి!" అంటూ బుజ్జి గొడవ ఎక్కువయింది. వాడు బైటికి చెప్తున్నాడు, ఆమె చెప్పకోడం లేదు - అంతే! ఆమె పేగులూ జాలిగా అరుస్తున్నాయి- ఏదైనా ఇంత తిండి పడెయ్యమన్నట్టు. ఇంట్లో వున్న మంచి నీళ్ళు కూడా అయిపోయాయి. సుబ్బారావు అజాపజా లేదు.

'ఏం చెయ్యాలి! ఆకలితో అల్లాడిపోతున్న పసివాడినెలా వూరుకోబెట్టాలి. ఎలా ఈ ప్రాణాన్ని నిలుపుకోవాలి'— ఇవే ఆమె మనసుని కలచి వేస్తున్నాయి.

మరోసారి వంటింట్లోకెళ్ళి డబ్బాలన్నీ చూసింది - అదృష్టవశాత్తూ ఏదైనా దొరుకుతుందేమో అన్నట్టు. కానీ నాలుగు మిరపకాయలు, ఓ పావుశేరు ఉప్పు తప్ప ఏంలేవు.

నీరసంగా ముందుగదిలో కొచ్చింది పార్వతి.

పెద్దగా వురిమింది ఆకాశం.

"అమ్మా!" తల్లిని గమనిస్తున్న బుజ్జి జాలిగా పిల్చాడు. కొడుకుకేసి చూసింది పార్వతి.

"నాన్న ఇంకా రాలేదేం?"

"వస్తారు" ముభావంగా అందామె.

"ఇంకా ఎప్పుడు?" బుజ్జిగాడి మాటలో అపనమ్మకం.

"వాన తగ్గాక"-పరధ్యానంగా అంది తల్లి.

"వాన తగ్గడంలేదు"

"తగ్గుతుంది"

"నాకన్నం కావాలి"

"నాన్న రానీ" పాత పాటే పాడింది పార్వతి.

"కాదు. నాకిప్పుడే కావాలి" ఏడుపు మొదలు పెట్టాడు బుజ్జి.

పార్వతిలో సహనం చచ్చిపోయింది. భర్తమీద, వానమీద, ఆకలిమీద, తన నిస్సహాయత్వం మీద పిచ్చికోపం వచ్చింది.

"చెప్పేది నీకు కాదూ! ఈసారి అన్నం మాటెత్తావంటే చంపేస్తాను" అరిచింది.

"ఆకలేస్తుంటే ఏం చెయ్యను" బుజ్జి అరిచాడు.

అంతే! పార్వతి విసురుగా కొడుకు దగ్గర కొచ్చి ఎడా పెడా బాదేసింది.

బుజ్జి నిర్ఘాంతపోయాడు. వాడికి ఏడుపు రాలేదు. 'అంతవరకు బుజ్జగించి వూరుకోబెట్టిన అమ్మ ఇప్పుడేమిటి ఇలాబాదింది'— అన్న విస్మయమే వుంది వాడి కళ్ళల్లో.

'నిజమే! అన్నం లేదుగా. అమ్మ మాత్రం ఏం చేస్తుందిలే' అనుకున్నాడు తనలో.

తను చేసిన పనికి కృంగిపోయింది పార్వతి. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. అయినా బైటపడకుండా కిటికీ దగ్గరికెళ్ళి తలుపు తీసి బైటికి చూడసాగింది.

"అమ్మా!" మళ్ళీ పిల్చాడు బుజ్జి.

ఈసారి వాడి గొంతు మార్దవంగా వుంది.

"ఏమిటి!" గంభీరంగా అంది పార్వతి.

"అగ్గిపెట్టె వుందా!"

"ఎందుకు?" ముఖం చిట్లించిందామె.

"నాన్న బియ్యం, కూరలు తెస్తే వెంటనే వంట చేసుకోవడానికి" అమాయకంగా అడిగాడు బుజ్జి.

ఇక ఆపుకోలేక పార్వతి ఒక్క అంగలో కొడుకు దగ్గరికొచ్చి, వాణ్ణి గుండెలకి హత్తుకుని బావురుమంది.

బుజ్జి బావురుమన్నాడు.

అలా ఏడుస్తూనే నిద్రలోకి జారిపోయాడు.

పార్వతి మనసంతా చేదుగా అయిపోయింది.

'ఛీ! ఎంత పాపిష్టిదాన్ని. పసిబిడ్డ ఆకలంటే తీర్చలేకపోగా గొడ్డుని బాదినట్టు బాదాను. వాడికేం తెలుసు' అనుకుని కుమిలిపోయింది.

అతి భారంగా మరో గంట గడిచింది.

వాన కాస్త తగ్గుముఖం పట్టింది.

బుజ్జి నిద్రలో ఏదో కలవరిస్తున్నాడు.

హఠాత్తుగా పార్వతికో ఆలోచనొచ్చింది.

తమ ఇంటికి ఓ ఫర్లాంగు దూరంలోవున్న మంగమ్మ గారింటికెళ్ళి తిండానికేమైనా తేవాలి. లేకపోతే పసివాడు చచ్చిపోతాడు'— అని! వెంటనే లేచి బుజ్జిని తట్టి లేపింది.

వాడు గబాల్న లేచి —

"ఏమిటమ్మా నాన్నొచ్చారా! బియ్యం అవీ తెచ్చారా?" ఆశ, ఆతృత వాడి గొంతులో సమపాళ్ళలో వున్నాయి.

"ఊహు, రాలేదు. ఎందుకు రాలేదో కనుక్కొస్తాను. నువ్వు భయపడకుండా వుంటావా!" అంది పార్వతి.

"మరి వానొస్తోందిగా!"

"పరవాలేదు. చాలా వరకు తగ్గిపోయింది. నాన్న [illegible]డ లేకపోయినా కాసిని బియ్యం అవీ అడిగి తెస్తాను."

[illegible]" అన్నాడు బుజ్జి, బియ్యం అన్నమాట [illegible] వాడి ప్రాణం లేచొచ్చినట్టయింది.

[illegible] పాతగోనె కప్పుకుని, తలుపు వేసుకోమని [illegible] వానలోనే బైటికి పరుగెత్తింది పార్వతి. మోళ్ళ లోతు పైగా వున్నాయి నీళ్ళు.

తెలిసినదారే కాబట్టి తేలిగ్గానే వెళ్ళచ్చు అనుకుని ఈదుతున్నట్టు నడవసాగింది. అయితే ఎక్కడ దారో, ఎక్కడ గోతులో తెలియడంలేదు. పైగా ఎడాపెడా విరిగి పడిన కొమ్మలు... ఆ కొమ్మల్ని చుట్టుకుని ప్రాణాలు కాపాడుకొనడానికి చేరిన వందలాది నీటి పాములు. భయంకరంగావుంది వాతావరణం. మెరుపుల వెలుగుని ఆధారంగా చేసుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోంది పార్వతి.

ప్రచండ గాలికి చెట్లు వూగిపోతున్నాయి.

నీళ్ళ వేగానికి చిరు జంతువులు కొట్టుకు పోతున్నాయి. ఎక్కడ చూసినా నీళ్ళు! రక్తాన్ని గడ్డ కట్టించే చలి!

నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఓ నల్లతాచు పార్వతికి తగిలి ప్రాణభయంతో ఆమె చేతిని చుట్ట బోయింది.

మెత్తని ఆ స్పర్శకి ఒళ్ళు జలదరించిందామెకి. అప్పుడే మెరుపు వెలుగు పడి బ్రహ్మాండమైన తాచు తళుక్కు మన్నట్టు మెరిసింది.

అంతే! గభాల్న బలంగా చెయ్యి విదిలించింది పార్వతి. తిరిగి నీళ్ళలో పడిపోయిన ఆ నాగు నీళ్ళతో పాటు పల్లంలోకి కొట్టుకుపోయింది.

పార్వతి ఒణుకు తగ్గలేదు.

'కంగారులో ఆ పాము తనని కాటేస్తే!' ఆ ఊహే ఆమెని మరింత శక్తిహీనురాలిని చేసేసింది.

తిండిలేని ఒళ్ళు స్వాధీనం తప్పుతోంది. ఏ క్షణానైనా స్పృహ పోయేలా వుంది.

'ఈ నీళ్ళలో, ఎటో కొట్టుకుపోయి దిక్కు లేని చావు చావనుకదా' అని కూడా అనిపించింది.

'తను తొందరపడింది. ఇలాంటి పరిస్థితిలో ఇంటి నించి బయల్దేరుండకూడదు' అనుకుంది పదే పదే. తిరిగి వెళ్ళిపోదామా అన్నట్టు వెనక్కి చూసింది.

ఆమె గుండె ఝల్లుమంది.

పరవళ్ళు తొక్కుతున్న సముద్రంలా వుంది జల ప్రవాహం! లోకాన్ని మింగెయ్యాలని పరుగులు తీస్తున్న మృత్యుదేవతలా వుంది.

అంతకన్నా భయంకరంగా వికటాట్టహాసం చేసింది-కడుపులో అగ్నిలా రగులుతున్న ఆకలి!!

ఆ ఆకలే తెగింపు నిచ్చింది.

ధైర్యంగా ముందుకు సాగింది పార్వతి. ఏముకలు కొరికేలా వీస్తున్న చల్లగాలి, చెవులు బద్దలు చేస్తాయా అన్నంతలా గర్జిస్తున్న ఆకాశం, కాళరాత్రి లాంటి ఆ భయంకర వాతావరణంలో ధైర్యంగా ముందుకు సాగింది ఓ నిరుపేద మాతృమూర్తి.

ఆమె ధ్యేయం — ఎలాగైనా కొడుకు ఆకలి తీర్చాలి, తను ఆకలి చావు చచ్చినా సరే తన బిడ్డ కడుపు నింపాలి. ఈ ధ్యేయంతోనే ఆమె గమ్యం చేరగలిగింది.

అలాంటి సమయంలో తలుపు తట్టిన ఆమెని చూసి నిర్ఘాంతపోయారా ఇంటివాళ్ళు. అభిమానాన్ని అవతలికి నెట్టి విషయం వివరించింది పార్వతి.

"వాణ్ణి కూడా ఎలాగో తీసుకొచ్చెయ్యాల్సింది" — ఇంటి యజమాని.

"ఇంత సాహసం చేశావ్! నువ్వు తొందరపడ్డావ్ పార్వతీ" అందా ఇంటి ఇల్లాలు మంగమ్మ.

తన పరిస్థితి మరోసారి వివరించి తినడానికేమైనా ఇవ్వమని మరోసారి దీనంగా వేడుకుంది పార్వతి. ఆ ఇల్లాలు లోనికెళ్ళి చూసి పసివాడికి సరిపడేంత అన్నం, కాస్త ఆవకాయ, ఓ సంచీలో రెండు శేర్ల బియ్యం తెచ్చి-

"అన్నం లేదు పార్వతీ. ఈ బియ్యం తీసికెళ్ళి అన్నం వండుకోండి. ఇదిగో ఈ గిన్నెలో కాస్త అన్నం, ఊర గాయ పెట్టాను — వాడికి ముందు పెట్టు" అంటూ ఆమె కిచ్చింది.

పార్వతి కళ్ళు నీళ్ళతో నిండాయి. వారికి కృతజ్ఞతలు చెప్పుకుని సంచీని, గిన్నెని జాగ్రత్తగా పట్టుకుని తిరుగు ముఖం పట్టింది.

ఆమెకు లోకాన్ని జయించినంత ఆనందంగా వుంది. ఇంటివారు ఆమెకి పది జాగ్రత్తలు చెప్పి సాగనంపి, తలుపులు మూసుకున్నారు.

పార్వతి మెల్లగా సంచీని, గిన్నెని ఎత్తి పట్టుకుని నడవ సాగింది.

ఆమె సగం దూరం వచ్చేసరికి మళ్ళీ వాన జోరు పెరిగింది. నడక వేగం కాస్త పెంచింది. కాళ్ళకి చుట్టు కుంటున్న నీటిపాముల్ని విదిలించుకుంటూ, ఊపిరి బిగపట్టి మూడు వంతుల దూరం వచ్చేసింది.

భయంకరంగా వురిమింది ఆకాశం.

రివ్వున వీచిందో సుడిగాలి. రోడ్డు పక్కగా వున్న విగ్రద గన్నేరు చెట్టు కూకటివేళ్ళతో కూలి, దాని శిఖరాగ్రం పార్వతికి తగిలి నీళ్ళలో బోర్లా పడేసింది.

క్షణం వుక్కిరి బిక్కిరి అయిన పార్వతి తేరుకుని చూసేసరికి, బియ్యంతో సహా వంద గజాల దూరం కొట్టుకుపోయింది. అన్నం గిన్నెమాత్రం నీళ్ళలో తేలుతూ వచ్చిస్తోంది పల్లంకేసి.

తేరుకున్న పార్వతి ప్రాణానికి తెగించి గిన్నెవైపు పరిగెత్తింది.

ఆమె శ్రమ ఫలించింది.

గిన్నె అన్నంతో సహా దొరికింది. కాని అన్నం నిండుగా నీళ్ళు! అయినా ఆమెకి పిచ్చి ఆనందం వచ్చింది!

అందులోని నీళ్ళను వంచేసి ఇంటికేసి నడిచింది మొండిగా.

ఎలాగైతేనేం గమ్యం చేరింది.

ఆమెకి స్వర్గాన్ని జయించినంత ఆనందంగా వుంది.

తల్లి ఆగమనం కోసం ఆశగా ఎదురు చూస్తున్న బుజ్జి, తలుపు తట్టగానే గభాల్న లేచి తలుపు తీశాడు.

"అమ్మా! బియ్యం అవీ తెచ్చావా?" అన్నాడు ఆతృతగా.

"అన్నం తెచ్చాను — కంచం తెచ్చుకో" అంది గిన్నె కింద పెట్టి, గుడ్డలు పిండుకుంటూ.

బుజ్జి లోపలికి పరిగెత్తాడు.

పార్వతి గిన్నెలోని నీళ్ళన్నీ పూర్తిగా వంచేసింది. బురద నీళ్ళు, ఆవకాయ కలిసి అదోలా వుంది అన్నం. నీళ్ళలో కొంతపోగా పట్టెడన్నం మాత్రమే వుంది. దాన్ని జాగ్రత్తగా పిండింది నీళ్ళు లేకుండా.

ఆమెకది బురదతో కలిసిన అన్నంలా లేదు. ప్రాణం నిలిపే అమృతంలా వుంది.

ఆకలి ఆకాశం ఎత్తుకు పెరిగిపోయింది.

పేగులు గోలగా అరిచాయి.

అప్రయత్నంగా నీళ్ళని పిండుతున్న ఆమె చెయ్యి నోటి దగ్గరికెళ్ళింది. చేతిలోని ముద్దని ఆబగా నోట్లో పెట్టుకుంది.

అప్పుడే కంచంతో వచ్చిన బుజ్జి ఆ దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాడు.

మరుక్షణం మెల్లగా దగ్గరకొచ్చి తన చిన్నారి చేతులతో గిన్నెలోంచి మరో ముద్ద తీసి ఆమె నోటి దగ్గర పెట్టి "ఆకలేస్తోందామ్మా, తిను! నాన్నొచ్చాక వంట చేసి నాకు పెడుదువుగాని" అన్నాడు.

వాస్తవంలోకొచ్చిన పార్వతి నిలువెల్లా ఒణికిపోయింది. భూకంపం వచ్చినట్టు సముద్రాలన్నీ ఏకమై తనని ముంచేస్తున్నట్టు అనిపించింది.

నోట్లో పెట్టుకున్న ముద్ద నేలమీదికి జారిపోయింది.

"తినమ్మా! నాకు ఆకలిగా లేదు — నిజం" ఒక చేతిని తల్లి మెడచుట్టూ బిగించి, తన బుల్లి చేతిలోని ముద్దని తల్లి నోటి కందించాడు బుజ్జి.

వాడి కళ్ళు ప్రేమగా చూస్తున్నాయి తల్లిని.

పార్వతి గుండె మంచుముక్కలా అయిపోయింది.

"నాన్నా!" అంటూ వాడిని గుండెలకి హత్తుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

గిన్నెలో మిగిలిన బురద అన్నం మెతుకులు అలాగే వున్నాయి.

ఆ తల్లీ కొడుకుల కడుపులోకి చేరి రగులుకుని వువ్వెత్తున మండిస్తున్న అగ్నిలా మిడిసిపడుతున్న ఆకలి దెయ్యం క్షణం వెలవెలపోయింది.

బైట వాన కురుస్తూనే వుంది! ●

## "గణా"ధిపతి

*ఈ నగరానికి నిదురుండదు,*
*నిదురపోయిందెపుడు ఇంతకూ?*
*రోజూ నాలుగైదు "షో"లలో కనే కలలు*
*నగరం నిండా మారుమోగుతున్న సినీ అలలు*
*మూకుమ్మడి పైత్యానికి*
*పెత్తనం చేస్తున్న "గణా"ధిపతి!*

— నిఖిల్